1987 దీపావళి కథల పోటీలో రు 700/-లు బహుమతి పొందిన కథ

# గుండెలో పూల మొక్క

నేను యువకుణ్ణి. నాకు యువతరమంటే అసహ్యం.

మాలో నిజాయితీ లేదు. అవకాశవాదం ఎక్కువ.

మేము కులాల్ని నిరసిస్తాం. కులం పేరుతో సంస్థలూ స్థాపిస్తాం.

కులం వాళ్ళ నాకట్టుకునేందుకు కులం పేరుతో వాళ్ళను రెచ్చగొడతాం.

స్వార్థం కోసం కులం వాడినే వెన్నుపోటూ పొడుస్తాం.

మాకున్న ఆదర్శాలిన్నీ అన్నీ కాదు అవన్నీ మామాటకారితనాన్ని ప్రదర్శించడానికేతప్ప ఆచరణకు కాదు

ఆదర్శాలకోసం జీవితం త్యాగం చేయాలన్నది నా అబిమతం కాదు కానీ ఆచరణయోగ్యమైన ఆదర్శాలను పాటించడానికేం?

అందుకే నేను కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలనుకున్నాను

అందులోనూ హిపోక్రసీలేదు కట్న మిచ్చుకోలేని పేదింటి పిల్లనేపెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను

మగజీవితానికి ఆడతోడెంతో ముఖ్యం ఆతోడును మగాడు చేతులు సాచి ఆహ్వానించాలి పరస్పర సహకారంతో సహజీవనం నెరపాలి

ఆడదాన్నుద్ధరించడం కోసం కాదు పెళ్ళి!

నేను నా భార్య నుంచి కోరేదేమీ లేదు నా చూపులకు నచ్చే అందమామెకుండాలి నన్నర్థం



చేసుకుని సహకరించే మంచితన ముండాలామెకు

అందుకే నా భార్యను నేనే ఎన్నుకోవాలను కున్నాను

అనుకోకుండా నాకా అవకాశం వచ్చింది

ఉద్యోగ రీత్యా కాకినాడలో పోస్టయ్యాను

అక్కడ పరిచయ మయింది నాకు రాగిణి

రాగిణిని చూడగానే అమె నా స్వప్నసుందరి అనిపించింది అమెకోసం నా ఆదర్శాలన్నీ మర్చిపోవాలనిపించింది కానీ నాకా అవసరమూ రాలేదు

ఆ ఊళ్ళో మా దూరపు బంధువులున్నారు. అమ్మకు వరసలో అన్నయ్యవుతాడాయన కాకినాడ వెళ్ళగానే ఆయన్ను కలుసుకోమందమ్మ నాన్న మాత్రం ఆయన్ను కలుసుకోవద్దని రహస్యంగా నన్ను హెచ్చరించాడు

అమామయ్య పేరు రంగనాదం ఆయన కిద్దరు కూతుళ్ళు పెద్దమ్మాయి సరోజ రెండో అమ్మాయి పేరు రాగిణి ఊళ్ళో ఉద్యోగాని కొచ్చిన బంధువులబ్బాయిని తెలివిగా పట్టి వలేసి -కట్నం లేకుండా పెళ్ళి జరిపించేశాడాయన పెద్దమ్మాయికి నా విషయంలో నూ ఆయనంతే చేయగలడని నాన్న బయం

నా ఆదర్శాలు నాకున్నాయి గానీ వలలేసే వాళ్ళంటే నాకసహ్యం అందుకని నేను వాళ్ళని కలుసుకోలేదు

ఒకరోజు రాగిణి మా ఆఫీసుకు వచ్చి నన్ను కలుసుకుని ప్రసాదరావుగారు మీరేనా' అనడిగింది

ఆమె రూపానికి స్వర మాదుర్యానికి ముగ్ధుణ్ణై వెంటనే ఊఁ అని కూడా అనలేకపోయాను

రంగనాదం మామయ్య రెండో కూతుర్నెప్పుడో చిన్నప్పుడు చూశాను అప్పుడామెను గుర్తుంచు కునే విశేషమేమీ కనబడలేదు ఇప్పుడు ఛూసి వెంటనే మామయ్యను కలుషుకోనందుకు బాద పడ్డాను

నేను వచ్చి నెల్లాళ్ళయింది. నేను కాకినాడ వస్తున్నట్లు అమ్మ మామయ్యకుత్తరం వ్రాసింది. నేను వాళ్ళను తప్పకుండా కలుసుకుంటానని వ్రాసింది నా ఆఫీసడ్రసు కూడా తనే వ్రాసింది చూసి చూసి ఆయన రాగిణిని పంపాడు నా ఆఫీసుకి ఆయన ఆఫీసులో చిన్న గుమాస్తా ఆఫీసుటైములో ఆయన బైటకు కదలడు. ఆఫీసునుంచి ఫోన్ చేయడం ఆయన కిష్టం లేదు. మేనల్లుడి నాయన స్వయంగా ఇంటి కాహ్వానించాలను కుంటున్నాడు. చివరికాయన రాగిణిని పంపాడు

నేను మామయ్యింటికి వెళ్ళాను ఆ దంపతులు నన్నెంతో ఆప్యాయంగా ఆదరించారు.

నేను ప్రస్తుతం కంపెనీ గెస్టు హౌసులో ఉంటున్నాను.

మామయ్యింటి పక్క వాటా కాళీగా ఉంది ఆయన నన్నందులోకి మారమన్నాడు నేను వెంటనే అంగీకరించాను

నువ్వు నాకు ముందుగా కబురెట్టాల్సింది మామయ్యా? ఆఫీసు పనుల హడావిడిలో ఇల్లు చూసుకుందుక్కూడా సమయం లేదు నాకు. మీ యింటి కింత వరకూ రాలేక పోయినందుకేమి అనుకోకు-' అన్నాను.

మీ యింటి పద్ధతులు నాకు తెలుసు పిలిస్తే గానీ రారు మీ అమ్మ ఉత్తరం రాగానే పిలవాలను కున్నాను కానీ అమ్మాయి అబిమానవతి ఒ పట్టాన అదొప్పుకోలేదు దాన్నొప్పించ డానికిన్నాళ్ళు పట్టింది' అన్నాడు మామయ్య

నేను చిన్న బుచ్చుకున్నాను నన్ను వాళ్ళింటికి పిలవడం రాగిణి కిష్టం లేదు నేనేం తప్పు చేశాను?

నేను మాట్లాడక పోవడం గమనించిన మామయ్య నా ముఖ బావాలు చదివినట్లున్నాడు - ఇందులో నీ తప్పేమీ లేదు తప్పంతా ఆడపిల్లల్ని కన్నవాళ్ళది- అన్నాడాయన

అంటే?

మామయ్య వివరించాడు

పదహారేళ్ళు నిండినప్పట్నించీ ఆడపిల్ల పెళ్ళి గురించి తలిదండ్రులాలో చింతక పోయినా చుట్టు పక్కల వాళ్ళ సణుగుడు ప్రారంభమవుతుంది పెళ్ళి సంబంధాలు చూస్తే - పెళ్ళికొడుకులు సంతలో పెట్టిన ఖరీదైన పశువులవుతున్నారు అవిషయ మలాగుంచితే ఆడపిల్లల తలిదండ్రులేం చేసినా విపరీతార్థాలు బంధువుల్నీ స్నేహితుల్నీ అబిమానంతో ఆదరిస్తే దానికేమేమో అంటగట్టి - వాళ్ళను సీ ఐ ఏ ఏజెంట్లలా కేజీబీ మనుషుల్లా బావిస్తారు

సరోజ అందంగా ఉంటుంది ఆమెనో యువకుడిష్టపడి ప్రేమించి కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు రంగనాదం విసిరిన వలలో అతడు పడిపోయినట్లు వియ్యాలవారే కాదు - చుట్టు పక్కల వారు కూడా చెప్పుకుంటున్నారు వాళ్ళ యీడూ జోడూ బాగుందని కానీ - వాళ్ళు సుఖంగా కాపురం చేసుకుంటున్నారని కానీ ఎవరూ పట్టించు కోవడంలేదు రంగనాదం విసిరిన పాత వల గురించీ విసరబోయే కొత్త వల గురించీ వాళ్ళు చెప్పుకుంటున్నారు



అందుకే రాగిణి – మనింటికి పెళ్ళయిన దంపతు ల్నాహ్వానించు– ఆడవాళ్ళ నాహ్వానించు పెళ్ళి కాని మగాళ్ళనీ, పెళ్ళాం లేని మగాళ్ళనీ – వాళ్ళు ముసలాళ్ళయినా సరే– దగ్గర బంధువులైనా సరే– ఆహ్వానించవద్దు – అని తలిదండ్రులకు కచ్చితంగా చెప్పేసింది కానీ మా అమ్మ ఉత్తరం వ్రాయడం వల్ల రంగనాథం నా పట్ల ప్రత్యేక బాధ్యతను ఫీలై– రాగిణిని బ్రతిమాలుకున్నాడు ఆమె తండ్రి మాటల నర్థం చేసుకున్న దన్నందుకు సూచనగా – తనే అతడి నింటి కాహ్వానించింది అందుకామె విదించిన షరతేమిటంటే – తను నాతో మాట్లాడదు నన్ను కలుసుకోదు

పరిస్థితి తెలుసుకుంటావని చెప్పాను బాబూ! మన సమాజంలో ఆడపిల్లలను కన్నవారు మానసికంగా అస్పృశ్యులు అది మా ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు కావచ్చు కానీ ఆ కాంప్లెక్సును తొలగించే బాధ్యత నెవరూ స్వీకరించడం లేదు నీవేమి అనుకోకు మా యింటికి దగ్గర్లోనే ఉన్నా – నిన్ను మేమాదరించక పోతే అది ఘాతప్ప కాదు నీ అంతటనీవే చొరవ తీసుకుని తరచు మా యింటికి వస్తూంటే మా కాంప్లెక్సు తొలగి పోవచ్చు రాగిణి నీతో మాట్లాడక పోతే అది చిన్నతనంగా భావించకు వ్యక్తిత్వం గల పిల్ల అది దురదృష్ట వశాత్తూ యీ పేద వాడింట్లో పుట్టింది– అన్నాడు మామయ్య

రాగిణి అందం నన్నాకర్షించి ఉండకపోతే నేనా కుటుంబాన్ని అపార్థం చేసుకునే ఉండేవాణ్ణి నా కిప్పుడు రాగిణితో పరిచయం పెంచుకోవాలనుంది

మామయ్య పక్కింట్లో ప్రవేశించాను చొరవ తీసుకుని తరచుగా మామయ్యింటికి వెడుతూండే వాణ్ణి ఎన్నోసార్లు రాగిణితో మాట్లాడాలని ప్రయత్నించాను ఆమె నాకు ముక్తసరిగా సమాధానా లిచ్చి తప్పించుకునేది

ఆమెకు పద్దెనిమిదేళ్ళు నిండాయి బీయస్సీ రెండవ సంవత్సరం చదువుతోంది ఆమె గ్రూపు సైన్సు, లెక్కలు

నేను నీకు లెక్కల్లో సందేహాలుంటే సాయపడ గలను' – అని ఆమెకు చెప్పాను

# కుండీలో పూల మొక్క

క్లాసులో శ్రద్ధగా పాఠాలు వింటాను అప్పటికీ అర్థం కాకపోతే – అర్థమయ్యే దాకా మళ్ళీ మళ్ళీ చదువుతాను నా అంతట నేను విషయాన్నర్థం చేసుకోవడమే నాకిష్టం– అని రాగిణి నాకు బదులిచ్చింది.

రాను రాను నాకు రాగిణి అంటే ఆకర్షణ పెరిగి పోతోంది.

నేను రంగనాథం మామయ్య ఇంటి పరిస్థితి, మానసిక పరిస్థితీ – మా యింటి కుత్తర్వం వ్రాసి– "నేను రాగిణిని పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాను మామయ్య మనసుకు కష్టం కలుగని విధంగా ఈ సంబంధం మీరు స్థిరపరచాలి నాకై నేను పెళ్ళి పెద్దను కాదల్చుకోలేదు ఈ పెళ్ళి జరక్కపోతే మీకూ నాకూ సంబంధం తెగిపోదు. కానీ నేనిక పెళ్ళి చేసుకోను. నా పెళ్ళి మీరేచేయాలి. అదీ రాగిణితో!" అని స్పష్టం చేశాను

ఉత్తరానికి సమాధానంగా అమ్మ, నాన్న వచ్చారు.

నాన్న నాతో – నీ ఉత్తరం చదివాను – నేనూ ఆడపిల్ల తండ్రిని అయినా ఆకోణం నుంచి సమస్య నాలోచించ లేదు పిల్ల మనసు కష్టపడని విధంగా ఈ పెళ్ళి నిశ్చయం చేస్తాను–" అన్నాడు

ఆయన మంచి మనసు కాశ్చర్య పోయాను

అమ్మ తనకు మొదట్నించీ ఈ సంబంధం చేసుకోవాలని ఉన్నట్టు, అబ్బాయికి పిల్లతో పరిచయం కావడం ముఖ్యమనే – తను వాళ్ళ పరిచయాన్ని ప్రోత్సహించాననీ – వీధిలో ప్రచారం చేసింది

ఆవిధంగా నన్ను కొందరు అనుమానించే పరిస్థితి కూడా ఏర్పడింది నాలో ఏమైనా లోపాలున్నాయా అన్న చర్చ కూడా జరిగింది

దానికి నేను సిగ్గుపడలేదు

ఆడపిల్ల భరించే అవమానాల ముందిది ఏపాటి?

పైసా కట్నం లేకుండా సింపుల్‌గా ఓ గుడిలో మా పెళ్ళి జరిగింది

నాకెంతో సంతోషంగా ఉంది

నేనొక ఆడపిల్లనుద్ధరించాననుకోవడం లేదు

నేను కోరిన అందం నాస్వంత మయింది నా భార్యను నేను మనిషిగా గౌరవించి – నాజీవితంలోకి ఆహ్వానించాను

నా ఆదర్శం నిలబెట్టుకున్నాను

పెళ్ళయిన మర్నాడు శోభనం

ఒక చిన్న గదిలో ఆమె , నేను

ఆమె తలనిండా మల్లెపూలు – నా మనసునిండా కోరికలు

ఆమెను తాకగానే నావళ్ళు పులకరించింది దగ్గరకు తీసుకుంటే ఈ లోకాన్నే మరిచి పోయాను

నా కంటికి నచ్చిన అందం, మనసుకు నచ్చిన ప్రేయసి – తొలిరాత్రి నన్ను స్వర్గ వీధుల్లో విహరింప జేశాయి

ఆమె కూడా నన్నెంతగా ప్రేమిస్తోందో అప్పుడే నాకర్థమయింది

నేనామె అందాన్ని పొగిడితే – ఆమె నావ్యక్తిత్వాన్ని పొగిడింది

మధ్య మధ్య చిన్న చిన్న పొగడ్తలతో శృంగార మయ ప్రపంచంలో తేలిపోయాం – వారం రోజులు

రిసెప్షన్లో నన్ను చూసిన నా కొలీగ్సందరూ ఆఫీసులో నా అదృష్టాన్ని పొగుడుతున్నారు అన్నాను నేనామెతో – ఒకరోజున

రాగిణి ముక్తసరిగా నవ్వి ఊరుకుంది


నీ స్నేహితురాండ్రు నీ అదృష్టం గురించేమీ అనలేదా? అన్నాను కుతూహలంగా


రాగిణి మళ్ళీ నవ్వింది తప్ప మాట్లాడలేదు


# దీపావళి దృశ్యాలు

వన్నె తరిగి
చిన్నబోయిన మొహాలు
గుండెల్లో దిగుళ్ళ ముళ్ళు
దిగుతున్న అనుభూతి
ఉల్లాన్ని ఝల్లుమనిపించే
ఉల్లి ధర
గజగజ లాడించే
తైలం పేట్రేగిపోతూ
కరువు కాటకాల
కరాళ నృత్యం
మత మౌఢ్యాల హింసా జ్వాలలు
టెర్రరిజం పారించే రక్తపుటేరులు
అవినీతి అక్రమం విశ్వరూపం
కల్తీల కల్లోలంలో
ముత్యాలు రాల్చని మతాబులు
వెన్నెల్లు విరజిమ్మని చిచ్చుబుడ్లు
నక్షత్రాలు కురిపించని కాకరపువ్వొత్తులు
పేలని టపాసులు
లేని ఉత్సాహం తెచ్చుకుని
కష్టాల తిమిరంతో సమరం జరుపుతూ
కొత్త ఆశల ఊపిరితో జ్యోతులు వెలిగిస్తూ
మనిషి!

-కొడిమెల శ్రీరామమూర్తి






చెప్పవా? అన్నాను బ్రతిమాలు తున్నట్లు రాగిణి నాతో వివాహం గురించి ఎమనుకుంటోందో తెలుసుకోవాలనుంది నాకు

నా స్నేహితురాలు పద్మ మనపెళ్ళి కిచ్చిన ప్రెజంటేషన్ చూశారుగా? అంది రాగిణి

ఆ పెయింటింగు నాకు బాగా గుర్తుంది. ఎందుకంటే నాకదెంతో నచ్చింది

పద్మ స్వయంగా వేసిందిట ఆ పెయింటింగు

అది ఒక మేడలో బాల్కనీ ఆ బాల్కనీలో నాలుగు పూలకుండీలు ఒకో కుండీలో ఒకోరకం పూలమొక్క అన్నింటికీ పూలున్నాయి ఆ మొక్కల వంక ఓ యువకుడు చూస్తున్నాడు అతడి కనులలో స్పష్టంగా కనిపించే సంతృప్తి!

పద్మ ఆ బొమ్మల కుపయోగించిన రంగుల మిశ్రమం అద్భుతం!

అది నేను రాగిణికి మొదటిసారి పెయింటింగు చూసినప్పుడే చెప్పాను

నా పెళ్ళి గురించి పద్మ అభిప్రాయం అదే! అంది రాగిణి చటుక్కున

అంటే? అన్నానాశ్చర్యంగా

కుండీలోని పూల మొక్కలు- ఓ ఎత్తుకి మించి పెరగ కూడదు సాదారణంగా పూల కుండీల కోసం- ఎవరైనా అట్టే ఎదగని మొక్కల నెన్ను కుంటారు లేదా ఎదిగినప్పుడల్లా కత్తిరిస్తూంటారు ఆ మొక్కలు చక్కగా పెరగడం కోసం మట్టి మార్చడం ఎరువులు వేయడం చేస్తూంటారు తమ అంచనాకు మించి ఎదగకుండా కత్తిరిస్తూంటారు అవి అందంగా అగుపడవచ్చు ఆరోగ్యంగా ఉండవచ్చు ఆకర్షణీయమైన పూలు పూయవచ్చు అంతా యజమాని సంతోషానికే

నేను దెబ్బతిని- 'రాగిణీ! నీ స్నేహితురాలి కలాంటి అభిప్రాయ మెందుక్కలిగింది? నా యింట్లో నీకు స్వతంత్ర ముండదను కుందా? త్వరలోనే ఆమె తన ఆలోచన తప్పు- అని గ్రహిస్తుందిలే నీవు నా యింటికి మరో రాణివి నన్నే శాసించ గల సర్వాదికారిణివి- అన్నాను

రాగిణి తల వంచుకుని- పద్మ ఏ అభిప్రాయంతో

## కుండీలో పూల మొక్క

ఆ పెయింటింగు వేసిందో నాకు తెలియదు కానీ అది చూడగానే నాక్కలిగిన అభిప్రాయమది... అంది

నేను మళ్ళీ దెబ్బతిని- అయితే యిప్పుడు నీ అభిప్రాయం మారి ఉండాలి! అన్నాను

రాగిణి లేదని అనలేదు కానీ తల అడ్డంగా తిప్పింది

రాగిణీ- నేను నీకు నచ్చలేదా? అన్నాను బాదగా

'మీరు నచ్చారు కాబట్టే- నేనీ పెళ్ళి కాదనలేక పోయాను...

మరైతే నీ అసంతృప్తికి కారణం?

మీతో సంస్కార ముంది మీ వారితో సంస్కార ముంది మీరంతా ఈ పెళ్ళి నిర్ణయించిన పద్ధతిలో సంస్కార ముంది. నేను పెళ్ళి చేసుకుంటే నా తలిదండ్రులు సంతోషిస్తారు నాకు జీవితంలో మళ్ళీ యిలాంటి సంబంధం దొరికే అవకాశం లేదు మీ సంస్కారానికీ పరిస్థితులకూ తల వంచి ఈ పెళ్ళి అంగీకరించాను. లేకుంటే యిప్పట్లో పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం లేదు నాకు-"

నేను తెల్లబోయి- "పెళ్ళి చేసుకోకుండా ఎం చేద్దామని?" అన్నాను

చదువు కుందామను కున్నాను-

చదివి ఎం చేద్దామని?

ఏం చేద్దామని అంతా చదువుతారు? అంది రాగిణి

ఉద్యోగం- అన్నాను

కానీ- నేను చదువు కోసమే చదవాలను కుంటున్నాను సైన్సు సబ్జక్టు చదువుతూంటే- నాకు సైంటిస్టు కావాలని పిస్తుంది పరిశోధనలు చేసి ఎన్నో కొత్త విశేషాలు కనిపెట్టాల నుంది-

అనుకున్న వన్నీ అంతా చేయగలరా?

ఏమో- ప్రస్తుతానికి క్లాసు మొత్తం వంద మందిలో- నేనే ఫస్టు నేను గొప్ప సైంటిస్టు నవుతానని కాలేజీలో లెక్చరర్లంతా అంటారు నాకు బీయస్సీ పూర్తి చేసి- ఆ పైన యింకా యింకా చదువు కోవాలనుంది

నీకు చదువు కోవాలనుంటే నాతో చెప్పొచ్చుగా!

ఎమో- చెప్పాలంటే బయం వేసింది మీ రప్పుడే నాతో చాలాసార్లు మీరు కంటున్న కలల గురించి చెప్పారు ఆ కలల్లో మీ సంసార ముంది మీ సంసారాన్ని తీర్చి దిద్దడంలో నా పాత్ర ఉంది నా చదువు లేదు

"పోనీ- ఒక్కసారి నువ్వు చెప్పొచ్చుగా

రాగిణి తడబడుతూ- ఒక్కసారి కూడా మీరు నన్ను నా చదువు గురించి అడగ లేదు- అంది

తెల్లబోయాను ఆమె చెప్పింది నిజం నాకసలామె చదువు గురించి స్ఫురించనే లేదు ఆడపిల్లకు పెళ్ళే పరమావధి అన్న సామాన్యపు టభిప్రాయంలోకి నేనూ దిగజారి పోయాను

పెళ్ళయ్యాక కూడా ఎందరో పురుషులు చదువు కొనసాగించడం జరుగుతుంది పై చదువులకు వెళ్ళడం జరుగుతుంది ఆడదాని చదువు పెళ్ళితో ఆగిపోతుంది

వచ్చిన అవకాశం వదులుకోలేక రాగిణి నన్ను పెళ్ళి చేసుకుంది కానీ ఆమెకు పెళ్ళి కంటే చదువు మీదే ఆసక్తి ఎక్కువ!

నా ఆదర్శంలో - ఆడదాన్ని పెళ్ళి చేసుకుని ఎలా ఉద్ధరించాలో ఉంది కానీ చదువంటే ఆసక్తి ఉన్న ఆడపిల్ల నెలా ప్రోత్సహించాలో లేదు

ఆలోచిస్తూ- నేను నా డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాను

అక్కడ పద్మ పెయింటింగ్ కనబడింది

ఒక చిన్న బాల్కనీలో నాలుగు పూలకుండీలు వాటిలో నాలుగు పూల మొక్కలు వాటిని చూస్తూ సంతృప్తిని ప్రకటిస్తున్న యువకుడు!

ఆ దృశ్యం చూడ్డానికెంతో సహజంగా ఉంది

ఆ సహజత్వం నా కలల్లో మార్పు రానిస్తుందా? సంసార జీవితం గురించి నేను తొంగి చూస్తున్న భవిష్యత్తులో రాగిణి చదువును ప్రవేశించ నిస్తుందా?

ఏది ఏమైనా- కట్నం లేకుండా ఓ పేద పిల్లను పెళ్ళి చేసుకోవాలన్న నా ఆదర్శం మాత్రం ఎప్పుడో చిన్నబోయింది □